ప్రజా విశ్వంభర V3 NEWS లక్ష్యం సమాజహితం

ప్రతి అడుగులోనూ జో నా చేయి పట్టుకుని నడిపించింది: సూర్య



చెన్నై: 'నా కెరీర్‌లో నేను చాలా తప్పులు చేశాను. చాలాసార్లు కింద పడ్డా. ప్రతిసారి నా చేయి పట్టుకుని తీసుకెళ్లిన వ్యక్తి నా భార్య జ్యోతిక' అని అన్నారు సూర్య. ఆయన కథానాయకుడిగా జీతూ మాధవన్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ కామెడీ ఫిల్మ్ 'సీన్'. నజ్రియా కథానాయిక. నస్లేన్ కీలక పాత్ర పోషించాడు. ఈ మూవీ దీపావళి కానుకగా నవంబరు 6న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చెన్నైలో జరిగిన 'సీన్' ట్రైలర్ వేడుకలో సూర్య మాట్లాడారు.

మీ సహకారం మర్చిపోలేను..

''నా తొలి చిత్రం 'నేరుక్కు నేర్'కు దేవా సర్ సంగీతం అందించారు. ఈ వేదికపై నుంచి ఆయనకు నివాళులర్పిస్తున్నా. ఇన్నేళ్లలో మీ (అభిమానులు) ప్రేమ కొంచెం కూడా తగ్గలేదు. 500 మంది రక్తదాతలతో ప్రారంభమైన మన ప్రయాణం 5వేల మందికిపైగా రక్తదానం చేసే స్థాయికి చేరింది. ఈ విషయంలో మీ సహకారం మర్చిపోలేను. జీతూ మాధవన్ తీసిన 'రోమాంచం' చూసి నేను, జో పడిపడి నవ్వుకున్నాం. దానికి భిన్నంగా 'ఆవేశం' ఉంటుంది. ఆ రెండింటికన్నా కొత్తగా 'సీన్' ఉంటుంది. ఈ ఏడాది నాకు చాలా స్పెషల్. ఇప్పటికే 'కరుప్పు', 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో విజయాలు వచ్చాయి. ఇప్పుడు 'సీన్' విడుదలవుతోంది''

ధనుష్‌కు ధన్యవాదాలు..

''12 ఏళ్ల తర్వాత మళ్లీ తమిళ చిత్రపరిశ్రమకు వచ్చినందుకు నజ్రియాకు కృతజ్ఞతలు. ధనుష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. ఎందుకంటే దీపావళికి 'సీన్' వస్తుందని ప్రకటించగానే, ఆయన తన సినిమాను వాయిదా వేస్తున్నట్లు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సినిమా నాకు చాలా ఇచ్చింది. నాన్న ద్వారా నాకు ఈ వేదిక లభించింది. 2డి ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ప్రారంభమై 10ఏళ్లు, 'అగరం' ఫౌండేషన్ ప్రారంభించి 20ఏళ్లు అవుతోంది. ఇవన్నీ సమాజానికి తిరిగి ఏమైనా చేయాలనే ఉద్దేశంతో సాధ్యమయ్యాయి''

ఆ రెండూ ఉంటే చాలు..

''ఆన్‌లైన్‌లోనే కాదు, ఆఫ్‌లైన్‌లోనూ కష్టపడి పనిచేయండి. జీవితం చాలా అందమైంది. మనం ఊపిరి పీల్చేవరకు, ప్రాణం ఉండే వరకు ప్రతీది మళ్లీ సరిదిద్దుకోవచ్చు. ఏదీ శాశ్వతమైన ఓటమి, ముగింపు కాదు, ఏ బంధమూ పూర్తిగా తెగిపోదు. ప్రతి దాన్నీ సరిచేయగలం. మొదటి నుంచి మళ్లీ ప్రారంభించవచ్చు. '20ఏళ్లలో ఓ ఉద్యోగం సంపాదించాలి.. 25ఏళ్లలో ఇంత సంపాదించాలి.. 35ఏళ్లలో ఓ ఇల్లు కట్టుకోవాలి..' అంటూ చాలా మందికి కలలు ఉంటాయి. నాకు 50 ఏళ్లు దాటాయి. నాకు ప్రశాంతత, మంచి ఆరోగ్యం ఇవి రెండూ ఉంటే చాలను కుంటున్నాను. ఇవి రెండూ ఉంటే వాటిలోనే అన్నీ ఉంటాయి''

థ్యాంక్యూ జో..

''నేను ఈ రోజు ఈ స్థాయిలో ఉండటానికి, నా జీవితంలో ప్రతిదీ సరిగ్గా జరగడానికి, ప్రతి అడుగులోనూ నా చెయ్యి పట్టుకుని నడిపించింది నా భార్య జ్యోతిక. ఆమె ఉత్తమ తల్లి, స్నేహితురాలు, జీవిత భాగస్వామి. బలమైన మహిళ. థ్యాంక్యూ జో.. నా జీవితంలో ఉన్నందుకు నన్ను ఇంత దూరం నడిపించినందుకు.''

(ఈ సమయంలో జ్యోతిక మాట్లాడుతూ.. సూర్య లాంటి భర్త, ఇలాంటి కుటుంబం దొరకడం నేను చేసుకున్న అదృష్టం. అందరి ప్రేమకు ధన్యవాదాలు అని చెప్పారు).

ఆ హీరో నన్ను అస్సలు వదల్లేదు..

ఫోక్ సాంగ్స్, యూట్యూబ్ వీడియోలతో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న నటి నాగదుర్గ. ఈ అమ్మడు తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. ప్రియదర్శి హీరోగా, నాగదుర్గ హీరోయిన్‌గా నటిస్తున్న 'ఇడుపు కాయితం' సినిమాతో ఆమె వెండితెరకు పరిచయం అవుతున్నారు. వంశీకృష్ణ దొండపాటి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను బన్నీ వాసు నిర్మిస్తున్నారు. సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి తెరకెక్కుతున్నారు. ఈ సినిమాపై ఇప్పటికే భారీ హైప్ క్రియేట్ ఏర్పడింది. డిసెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానున్నది. ఈ సినిమా నుంచి తాజాగా 'గడప' అనే పాటను విడుదల చేశారు.'గడప' పాట విడుదల సందర్భంగా హైదరాబాద్‌లో ప్రత్యేక కార్యక్రమంలో నిర్వహించారు. నాగదుర్గ తన సినిమా ప్రయాణంతో పాటు షూటింగ్ సమయంలో జరిగిన ఆసక్తికర సంఘటనలను పంచుకున్నారు. ముఖ్యంగా హీరో ప్రియదర్శి తనను ఆటపట్టించిన విషయాన్ని ఆమె సరదాగా పంచుకున్నారు. సినిమాల్లోకి రావాలని తాను మొదట్లో అసలు అనుకోలేదని నాగదుర్గ తెలిపారు. అయితే 'ఇడుపు కాయితం' కథ పూర్తిగా విన్న తర్వాత, అందులోని శ్రీలత పాత్ర తన కోసమే ఉందనిపించిందని చెప్పారు. ఆ పాత్రలోకి వెళ్లేందుకు ఎంతో కష్టపడ్డానని, తనపై దర్శకుడు, నిర్మాతలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ప్రయత్నించానని తెలిపారు.

ప్రియదర్శి నన్ను ర్యాగింగ్ చేశారు!..

షూటింగ్ మొదలైన సమయంలోనే తాను చిన్న పిల్లనని, తనను బాగా చూసుకోవాలని టీమ్‌తో చెప్పానని నాగదుర్గ గుర్తుచేసుకున్నారు. అయితే హీరో ప్రియదర్శి మాత్రం తనను అస్సలు వదలలేదని చెప్పారు. షూటింగ్‌లో తనను తరచూ ర్యాగింగ్ చేస్తూ ఆటపట్టించేవారని సరదాగా ఫిర్యాదు చేశారు. కాలేజీ రోజుల్లో కూడా తనను ఎవరూ పెద్దగా ర్యాగింగ్ చేయలేదని నాగదుర్గ చెప్పారు. అందుకు కారణం తన తండ్రి పోలీస్ కావడమేనని తెలిపారు. కానీ ప్రియదర్శి మాత్రం తన తండ్రి పోలీస్ అనే విషయాన్ని కూడా పట్టించుకోకుండా తనను ఆటపట్టించేవారని నవ్వుతూ చెప్పారు.ప్రియదర్శిపై బన్నీ వాసుకు ఫిర్యాదు చేస్తానని బెదిరించినా ఆయన అస్సలు తగ్గలేదని వెల్లడించారు. ఒక సందర్భంలో 'వాసు సార్‌కు చెప్తా' అని నాగదుర్గ అనగా.. ప్రియదర్శి 'చెప్పుకోపో' అంటూ కౌంటర్ ఇచ్చారని చెప్పారు. అంతేకాదు, బన్నీ వాసును సరదాగా 'పెద్దరెడ్డి' అంటూ ప్రస్తావిస్తూ ఆయనకు ఫిర్యాదు చేస్తానని చెప్పినప్పుడు కూడా ప్రియదర్శి ఏమాత్రం భయపడలేదని నాగదుర్గ వివరించారు. ఈ విషయాలను ఆమె నవ్వుతూ చెప్పడంతో ఈవెంట్‌లో సందడి నెలకొంది.

బన్నీ వాసు కౌంటర్ వైరల్..

నాగదుర్గ చెప్పిన 'పెద్దరెడ్డి' ప్రస్తావనకు బన్నీ వాసు కూడా ఫన్నీగా రియాక్ట్ అయ్యారు. తనను అలా పిలిస్తే సోషల్ మీడియాలో అందరూ తనను 'పెద్దరెడ్డి' అని పిలిచే ప్రమాదం ఉందని నవ్వుతూ చెప్పారు. తాను ఇన్‌స్టాగ్రామ్‌లో మొత్తం కనిపించాల్సి వస్తుందని, నాగదుర్గ ఇంకా రెండు నిమిషాలు ఇలాగే మాట్లాడితే 'ఇన్‌స్టా తగలబడిపోద్ది' అంటూ కౌంటర్ వేశారు. ఇదిలా ఉంటే.. ఫోక్ సింగర్‌గా ప్రేక్షకులకు దగ్గరైన నాగదుర్గ.. 'శ్రీలత'గా హీరోయిన్‌గా ఎంతవరకు మెప్పిస్తారో తెలియాలంటే డిసెంబర్ 11 వరకు వేచి చూడాల్సిందే.

అందరినీ సంతృప్తిపరచాలంటే

ఐస్‌క్రీమ్ అమ్ముకోవాలి.. : ఏఆర్ రెహమాన్



'రామాయణ' చిత్రంలోని పాటలపై వస్తోన్న విమర్శలకు ఆస్కార్ విజేత, సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ స్పందించారు. ప్రతి ఒక్కరి అభిప్రాయానికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. 'అందరినీ సంతృప్తిపరచాలనుకుంటే ఐస్‌క్రీమ్ అమ్ముకోవాలి' అని యాపిల్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ జాబ్స్ చెప్పిన మాటలను గుర్తుచేసుకున్నారు.నితేశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రామాయణ: రైజ్ ఆఫ్ ఏ లెజెండ్'చిత్రానికి రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఇటీవల విడుదలైన 'మంగళ్ రంగ్' పాట సంగీతంపై కొందరు నెటిజన్లు విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలో ఓ ఇంటర్వ్యూలో రెహమాన్ మాట్లాడారు. ''ఒక పాట తుది రూపం దాల్చడానికి ఎంతో ఆలోచన, సమయం అవసరం. దేన్నైనా తొందరగా అంచనా వేయకూడదు. ఊరగాయలాగే.. స్వరాలు కూడా పాతబడే కొద్దీ మరింత రుచిగా మారతాయి. కొన్నిసార్లు మానవ సంస్కృతి, సంప్రదాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ప్రేక్షకులు ఒక కోణాన్ని మాత్రమే చూస్తారు. అందుకే కాస్త ఓపిక పట్టాలి'' అని ఆయన వివరించారు. ఇదే ఇంటర్వ్యూలో హాలీవుడ్ ఆస్కార్ విజేత సంగీత దర్శకుడు హాన్స్ జిమ్మర్ తో కలిసి పనిచేయడంపైనా ఆయన మాట్లాడారు. ''జిమ్మర్ భాగం కావడం వల్ల అంతర్జాతీయ ప్రేక్షకుల్లో ఈ చిత్రంపై ఆసక్తి పెరుగుతోంది. ఐదు భాషల్లో, హాలీవుడ్, భారతీయ వెర్షన్లకు వేర్వేరుగా సంగీతం అందించాల్సి వచ్చింది. దాదాపు పది చిత్రాలకు సరిపడా పని చేసినట్లుగా అనిపించింది'' అని రెహమాన్ తెలిపారు.రణబీర్ కపూర్, సాయిపల్లవి, ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న ఈ చిత్రం.. రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. పార్ట్ 1 దీపావళి కానుకగా నవంబరు 5న విడుదల కానుంది.

అమిత్ షాతో మెగా హీరోల భేటీ..



విశ్వంభర, హైదరాబాద్ : హైదరాబాద్‌కు వచ్చిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను మెగాస్టార్ చిరంజీవి, మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. నగరంలోని ఐటీసీ హోటల్‌లో బస చేసిన అమిత్ షా వద్దకు వెళ్లి వారిద్దరు ఆయనతో కాసేపు సమయం గడిపారు. ఈ సందర్భంగా అమిత్ షాను పొన్నాడ శాలువాతో సత్కరించి, ప్రత్యేక జ్ఞాపికను అందించారు. అయితే, అందుకు సంబంధించిన ఫొటోలను హీరో రామ్‌చరణ్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా షేర్ చేశారు. బీజేపీ మహా పాదయాత్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు అమిత్ షా హైదరాబాద్ విచ్చేసిన సంగతి తెలిసిందే. ఈ పర్యటనలోనే సినీ దిగ్గజాలు ఆయనను కలిసి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. కాగా, గతంలో త్రిపుల్ ఆర్ చిత్రంలోని 'నాటు నాటు' పాటకు ఆస్కార్ పురస్కారం లభించిన సమయంలోనూ చిరంజీవి, రామ్‌చరణ్ ఢిల్లీలో అమిత్ షాను కలవగా.. తాజాగా హైదరాబాద్ వేదికగా జరిగిన ఈ భేటీ సినీ, రాజకీయ వర్గాల్లో విశేష ఆసక్తిని రేకెత్తించింది.

అన్నీ అయ్యాకే సెన్సార్‌కు రండి..

నిబంధనలు కఠినతరం చేసిన సీబీఎఫ్‌సీ



సినిమాల సర్టిఫికేషన్ విషయంలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ నిబంధనలను కఠినతరం చేసింది. సినిమా విడుదల తేదీ దగ్గర పడిందంటూ ఆఖరి నిమిషంలో వచ్చే సర్టిఫికేషన్ దరఖాస్తులను ఇకపై అంగీకరించబోమని బోర్డు సీఈవో రాజేంద్ర సింగ్ స్పష్టం చేశారు. ఈ మేరకు చిత్రనిర్మాతలకు తాజా మార్గదర్శకాలను జారీ చేశారు.

రఫ్ కట్స్, ఇంకా పూర్తికాని వెర్షన్లను అంగీకరించరు. ఫైనల్ సౌండ్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, విజువల్ ఎఫెక్ట్స్ , సబ్‌టైటిల్స్, ఆడియో డిస్ట్రిబ్యూషన్ అన్నీ పూర్తయి ఉండాలి.

ముందుగానే రిలీజ్ డేట్ ప్రకటించాం. ప్రమోషన్లు చేశామని చెప్పినా ఎలాంటి ప్రత్యేక మినహాయింపు ఉండదు.

ప్రచార కార్యక్రమాలు, ప్రీమియర్ షోల తేదీలను చూపించి సర్టిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఒత్తిడి చేయకూడదు.

సెన్సార్ బోర్డు ఆమోదం తెలిపే వరకు సినిమా టైటిల్‌ను కూడా ఫైనల్ చేయకూడదు. అన్ని పనులు ముందుగానే పూర్తి చేసుకుని సమయానికి దరఖాస్తు చేసుకోవాలి.

సీబీఎఫ్‌సీ తాజా నిర్ణయం భారీ బడ్జెట్ సినిమాలకు కాస్త ఇబ్బందికరమే. సాధారణంగా వీఎఫ్ఎక్స్ , కలర్ గ్రేడింగ్ లాంటి పోస్ట్ ప్రొడక్షన్ పనులను సినిమా రిలీజ్‌కు కొన్ని రోజుల ముందు వరకు మేకర్స్ చేస్తుంటారు. తాజా నిబంధనల నేపథ్యంలో సర్టిఫికేషన్ ఆలస్యం కాకుండా ఉండాలంటే ఆ పనులన్నీ ముందుగానే పూర్తి చేసుకోవాలి. మరోవైపు సెన్సార్ బోర్డు నిర్ణయం వల్ల థియేటర్లలో ఆఖరి నిమిషంలో షోలు రద్దయ్యే సమస్యలు ఉండవు.

మళ్లీ మొదలైన వివాదం..

కెరీర్‌ను నాశనం చేశారంటూ త్రివిక్రమ్‌ను ఉద్దేశించి పూనమ్ కౌర్ సంచలన పోస్ట్..



నటి పూనమ్ కౌర్ చాలా కాలంగా సినిమాలకు దూరంగా ఉంటున్నప్పటికీ, నిత్యం ఏదో ఒక వివాదంతో వార్తల్లో నిలుస్తూనే ఉన్నారు. సోషల్ మీడియాలో ఆమె పెట్టే సంచలన పోస్టులు తీవ్ర దుమారం రేపుతుంటాయి. ముఖ్యంగా స్టార్ డైరెక్టర్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌కు, పూనమ్ కౌర్‌కు మధ్య గత కొద్దికాలంగా పరోక్ష యుద్ధం నడుస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఆమె పెట్టిన ఒక పోస్ట్ నెట్టింట తీవ్ర చర్చనీయాంశంగా మారింది. త్రివిక్రమ్ పేరును నేరుగా ప్రస్తావించకుండా ఆయనను ఫేక్ గురూజీ అని సంబోధిస్తూ పూనమ్ కౌర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తన కెరీర్‌ను ఆయనే ముగించారని, ఆయన చేసిన దుర్వినియోగాన్ని, ప్రవర్తనను తను ప్రశ్నించాననే కారణంతోనే ఇలా చేశారా అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు దేవుడు ఆయనకు ఏం చేశాడో చూడాలంటూ, ఇప్పటికైనా కనీసం కొంతైనా సిగ్గుపడాలని సంచలన వ్యాఖ్యలు చేశారు. స్టేజీలు ఎక్కి వేదికలపై నీతులు చెప్పవచ్చు కానీ, తను మాత్రం నిజ జీవితంలో వాటిని ఆచరిస్తానని ఘాటుగా రాసుకొచ్చారు. ఈ వ్యాఖ్యలు నేరుగా త్రివిక్రమ్‌ను ఉద్దేశించే పెట్టారంటూ సోషల్ మీడియాలోనూ పెద్ద ఎత్తున చర్చలు జరుగుతున్నాయి. ఇక ఈ పోస్ట్‌పై సోషల్ మీడియా వేదికగా నెటిజన్ల నుంచి భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది నెటిజన్లు పూనమ్ ధైర్యాన్ని మెచ్చుకుంటూ ఆమెకు మద్దతుగా నిలుస్తుంటే, మరికొందరు మాత్రం ఆమె తీరును తీవ్రంగా విమర్శిస్తున్నారు.

ఖేలో ఇండియా పోటీలకు అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో కూడిన శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చెయ్యాలి : సీఎం రేవంత్



విశ్వంభర, హైదరాబాద్ : ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లకు సంబంధించిన అన్ని వనరులను ఖేళో ఇండియా 2026 పోటీలకు సైతం ఉపయోగించుకునేలా సమాంతరంగా ఖేళో ఇండియా పోటీల ఏర్పాట్లు డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 8వ ఎడిషన్ క్రీడల పోటీల నిర్వహణ ఏర్పాట్లపై మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ పోటీలకు ఎక్కడా ఏర్పాట్లలో నాణ్యతా ప్రమాణాల లోపం లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఈ సందర్భంగా ఆదేశించారు.మంత్రులు జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డిలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. తెలంగాణ క్రీడా విధానం, యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే క్రీడల హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో ఈ పోటీలను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించడమే దీర్ఘ కాలిక లక్ష్యంగా అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, ప్రపంచస్థాయి క్రీడా శిక్షణను తెలంగాణ యువ క్రీడాకారులకు అందించేందుకు ఈ పోటీలు ఒక గొప్ప అవకాశంగా మలుచుకోవడం ప్రభుత్వ ఉద్దేశమని ఈ సందర్భంగా సీఎం అన్నారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లకు సంబంధించిన అన్ని వనరులను ఖేళో ఇండియా పోటీలకు సైతం ఉపయోగించుకునేలా సమాంతరంగా ఖేళో ఇండియా పోటీల ఏర్పాట్లు చెయ్యాలని సీఎం సూచించారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ లో క్రీడలు, క్రీడాభివృద్ధికి సంబంధించిన పెట్టుబడుల ఆకర్షణ కూడా ఒక భాగం అయినందున అధికారులందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు.యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి వారిని అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలన్నారు. అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో క్రీడా ప్రాంగణాలను తీర్చిదిద్ది ఖేళో ఇండియా పోటీల తర్వాత కూడా అవి గొప్ప క్రీడా వనరులుగా ఉపయోగపడేలా చూడాలన్నారు. ఏర్పాట్లలో నాణ్యతా ప్రమాణాల లోపం లేకుండా పటిష్ట చర్యలు తీసుకునే విధంగా గ్రూప్ 1 స్థాయి అధికారులకు ఏర్పాట్ల నుంచి క్రీడలు ముగిసే వరకు పర్యవేక్షణా బాధ్యతలు అప్పగించాలన్నారు. వివిధ జిల్లాల్లో జరగనున్న పోటీలకు సంబంధించి ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం ఆయా చోట్ల స్థానికంగా పనిచేస్తున్న ట్రైనీ అధికారులు, గ్రూప్ 1 అధికారులను నియమించాలన్నారు.

క్రీడాకారులకు ఆహారం, వసతి సౌకర్యాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. ప్రతి వారం ఏర్పాట్ల పురోగతిపైసమాచారమివ్వాలన్నారు. కాగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో క్రీడా పోటీల్లో జరిగిన పరిణామాలు నివృత్తి కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గత ప్రభుత్వ పాలనలో క్రీడలకు కొన్ని చోట్ల చేపట్టిన మౌలిక సదుపాయాల పనులు క్రీడా పోటీలు ముగిసిన కొన్నేళ్ళలోనే విచ్ఛిన్నం అయ్యాయని గుర్తు చేశారు.ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో క్రీడా పోటీల ప్రారంభ, ముగింపు వేడుకల్లో అనవసరమైన ఆడంబరాలకు తావు లేకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. డిసెంబరు 11 నుంచి 22 వరకు జరిగే ఖేలో ఇండియా క్రీడా పోటీలకు దేశవ్యాప్తంగా వేలాది మంది యువ క్రీడాకారులు పాల్గొననున్నారు. ఏడు వేలకు పైగా యువ క్రీడాకారులతో పాటు సుమారు రెండు వేల మంది కోచింగ్ సిబ్బంది, అధికారులు రాష్ట్రానికి రానున్నారు. రాష్ట్రంలో హైదరాబాద్ సహా 6 నగరాల్లో 20 చోట్ల 27 రకాల క్రీడా పోటీలు, ఒక డెమో పోటీ నిర్వహించనున్నారు. తెలంగాణ కర్రసాము క్రీడను కూడా అతిథ్య రాష్ట్ర కోటాలో ఖేలో ఇండియా క్రీడల్లో చేర్చే విధంగా వెంటనే కార్యాచరణ చేపట్టాలని సీఎం సూచించారు.ఈ పోటీల్లో తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులు సత్తా చాటే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే వివిధ జిల్లాల్లో ఖేలో ఇండియా శిబిరాల్లో క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు. వివిధ క్రీడల పోటీల నిర్వహణ కోసం 20 వేదికల్లో చేపడుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులు వివరించారు.ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సలహాదారు కె. రామకృష్ణా రావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ (స్పోర్ట్స్) వాణీ ప్రసాద్, స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోనిబాలా దేవి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇది పిల్లలు నటించిన పెద్దల సినిమా..



కథా బలమున్న చిత్రాలను ప్రేక్షకులకు అందిస్తూ సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్‌గా, డిస్ట్రిబ్యూటర్‌గా పేరు తెచ్చుకున్నారు ధీరజ్ మొగిలినేని. ఆయన తన ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై తీసుకొస్తున్న తాజా చిత్రం 'సమ్మర్ హాలిడేస్'. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసే ఒక అందమైన కథతో దర్శకుడు శ్రీకర్ నయన్ రూపొందిస్తున్నారు. మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబీ ఖుషి కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీ ఈ నెల 6న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తోంది. ఈ క్రమంలోనే ప్రమోషన్స్‌లో భాగంగా మీడియాతో ముచ్చటించిన డైరెక్టర్ శ్రీకర్ నయన్ సినిమా విశేషాలు పంచుకున్నాడు. 'కాలేజ్ డేస్ లోనే షార్ట్ ఫిలింస్ రూపొందించాను. అలా స్క్రిప్ట్, షార్ట్ ఫిలింస్ మేకింగ్ మీద ఆసక్తి పెరిగింది. చదువులు పూర్తయ్యాక హైదరాబాద్ వచ్చి తెల్లవారితే గురువారం, మరికొన్ని చిత్రాలకు దర్శకత్వశాఖలో పనిచేశాను. కొన్ని కథలు సిద్ధం చేసుకుని అవకాశాల కోసం ప్రయత్నాలు ప్రారంభించాను. మధుర శ్రీధర్ రెడ్డి గారి ద్వారా ధీరజ్ మొగిలినేనిని కలిశాను. ఆయనకు ఒక థ్రిల్లర్ మూవీ కథ చెప్పాను. కథ ఆయనకు నచ్చింది. అయితే ఫిలిం మేకింగ్‌లో అనుభవం ఉంటే బాగుంటుంది మనం ఖచ్చితంగా చేద్దామని చెప్పారు. ఆ తర్వాత కొన్ని ప్రొడక్షన్ హౌస్ లు అవకాశం ఇచ్చాయి కానీ అక్కడ సినిమా సెట్స్ మీదకు వెళ్లేందుకు చాలా టైమ్ పట్టేలా కనిపించింది. ఆ తర్వాత ధీరజ్‌కు సమ్మర్ హాలిడేస్ కథ నచ్చి అవకాశం ఇచ్చారు. ఆయన ఓకే అన్నాక చకచకా కాస్టింగ్, టెక్నీషియన్స్ ఫైనల్ అవడం.. ఇలా పనులన్నీ జరిగిపోయాయి. ఫస్ట్ మా సినిమాకు అనుకున్న టైటిల్ సమ్మర్ ఫ్రెండ్. రెండు వేర్వేరు ప్రపంచాలు ఉన్న ఇద్దరు పిల్లలు సమ్మర్‌లో స్నేహితులు అయితే ఎలా ఉంటుందనే పాయింట్ మీద ఈ కథను రెడీ చేశాను. మనం అమ్మమ్మ ఊరికి సమ్మర్‌లో వెళ్లినప్పుడు ఎన్నో మెమొరీస్ ఉంటాయి. ఇలాంటివి మనందరి జీవితాల్లో చూసి ఉంటాం. మాది పిల్లల సినిమా కాదు పిల్లలు నటించిన పెద్దల సినిమా. ఔట్ అండ్ ఔట్ ఎంటర్‌టైనర్. మా సినిమాను థియేటర్‌లో చూసి ఎక్సిపీరియన్స్ చేయాలి.. ఖచ్చితంగా మంచి ఎక్స్‌పీరియన్స్‌ను ఇస్తుంది' అని చెప్పుకొచ్చాడు డైరెక్టర్.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. RNI No : TGTEL/25/A1676, Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com